www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 15 సెప్టెంబరు 2023
5
పశ్చిమ గోదావరి

నేడు తాడేపల్లిగూడెంలో 'జగనన్నకు చెబుదాం' వాయిదా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 15వ తేదీ శుక్రవారం తాడేపల్లిగూడెంలో నిర్వహించ తలపెట్టిన జగనన్నకు చెబుదాం' మండలస్థాయి స్పందన కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రారంభిస్తామని తొలుత ప్రకటించారు. అయితే గురువారం రాత్రి ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంతి మరో ప్రకటన విడుదల చేశారు.

'పొత్తు'పై మల్లగుల్లాలు..!

టిడిపి, జనసేన పొత్తుపై పవన్‌కల్యాణ్ స్పష్టత
జిల్లాలో ఇరుపార్టీల నేతల్లో చర్చలు
సీట్ల పంపకాలపై ఎవరి లెక్కలు వారివే
ఏయే సీట్లలో ఎవరెవరు బరిలోకి దిగుతారంటూ సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అంతా ఊహించుకుంటున్నట్లుగానే టిడిపి, జనసేన మధ్య పొత్తు ఖరారైంది. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసే పోటీ చేస్తాయని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ స్పష్టమైన ప్రకటన చేశారు. దీంతో టిడిపి, జనసేన పొత్తుపై దిగువస్థాయిలో ఆయా పార్టీల శ్రేణుల్లో నెలకొన్న సందేహాలు పటాపంచలయ్యాయి. దీనికి బిజెపి కలిసొస్తుందని ఆశిస్తున్నామని, ఒకవేళ బిజెపి రాకపోయినా టిడిపితో పొత్తు ఖాయమన్నట్లు పవన్ చేసిన ప్రకటన టిడిపి శ్రేణుల్లో ఉత్సాహాన్నిచ్చిందని చెప్పొచ్చు. చంద్రబాబు అరెస్టు నేపథ్యం దగ్గర నుంచి జనాల్లో సానుభూతి ఉన్నా ప్రభుత్వ నిర్బంధం, ఇతర కారణాల రీత్యా టిడిపి శ్రేణులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. అక్కడికీ పోలీసు నిర్బంధానికి ఎదురొడ్డుతూ పాలకొల్లు, తణుకు తదితర ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. చంద్రబాబుకు రిమాండ్, ఆపై బెయిల్ రాకపోవడం, లోకేష్‌ను సైతం అరెస్టు చేస్తారనే వార్తల నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణుల్లో ఒకింత అలజడి నెలకొంది. ఈ క్రమంలో జనసేనాని పొత్తు ప్రకటనతో టిడిపి శ్రేణులకు ఉత్సాహంతోపాటు ధైర్యాన్నిచ్చిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇదే క్రమంలో గోడమీద పిల్లివాటంలా బిజెపి ఎప్పటిలానే పొత్తుల సంగతి తమ జాతీయ నేతలు చూసుకుంటారని, పవన్‌తో తమ పొత్తు కొనసాగుతుందని ప్రకటించడం వెనుక మర్మమేమిటా అని అంతా తర్జనభర్జనలు పడుతున్నారు.

పవన్ కల్యాణ్ ప్రకటనతో జిల్లాలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఒకరకమైన జోష్ నెలకొంది. జనసేనకు ఉన్నంతలో బలమైన ఓటుబ్యాంకు ఉన్న జిల్లాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాది అగ్రస్థానమే. పలు నియోజకవర్గాల్లో కాపు సామాజిక తరగతి ఓట్లు ఎక్కువగా ఉండటం, వారితో ఎక్కువ శాతం జనసేనకు అండగా ఉంటున్న పరిస్థితి స్థానిక సంస్థల ఎన్నికల నుంచి స్పష్టంగా కన్పిస్తోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి, జనసేన పరస్పర అవగాహనతో పోటీకి దిగడం కూడా వైసిపికి గట్టిపోటీనిచ్చినట్లయ్యింది.



గత సాధారణ ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీ చేసినప్పటికీ జిల్లాలోని నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఉంగుటూరు వంటి నియోజకవర్గాల్లో ఆ పార్టీ ప్రభావం చూపింది. నాడు వామపక్షాల సహకారంతో పలు నియోజకవర్గాల్లో టిడిపిని వెనక్కినెట్టి రెండోస్థానంలో జనసేన నిలిచిన పరిస్థితి ఉంది. నాటి కంటే ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన నిర్మాణం బలపడటంతో క్షేత్రస్థాయిలో సైతం బలం పెరిగినట్లు కనిపిస్తోంది.

ఒంటరిగా పోటీచేస్తే గెలవడం కష్టసాధ్యమని, టిడిపితో కలిసి ఎన్నికలకు వెళ్తే వైసిపిని ఓడించొచ్చని జనసేనాని యోచిస్తున్నట్లు కొంతకాలంగా విస్తృత చర్చ సాగుతోంది. వైసిపి ప్రభుత్వ దుందుడుకు వైఖరి, నిర్బంధాల రీత్యా టిడిపి కూడా అదేవిధంగా ఆలోచన చేస్తున్న పరిస్థితి ఉంది. జనసేన ప్రస్తుతం ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉంది. బిజెపితో కలిసి జనసేనాని పని చేస్తున్నారు. బిజెపి మాత్రం టిడిపితో పొత్తుకు సంసిద్ధంగా లేన్నట్లు సంకేతాలిస్తూ వస్తోంది. బిజెపి టిడిపితో పొత్తుకు ఒప్పుకోకపోతే పవన్ టిడిపితో పొత్తు పెట్టుకుంటారా అనే అనుమానాలు ఇరుపార్టీల నేతల్లోనూ నెలకొంది. అయితే గురువారం రాజమండ్రిలో పవన్ చేసిన ప్రకటనతో ఆ అనుమానాలన్నీ పక్కకుపోయాయి. ఇక ఎవరెవరు ఎక్కడ పోటీ చేసే అవకాశం ఉందనే అంశంపై సమాలోచనలు ప్రారంభమయ్యాయి.

సీట్ల పంపకాలపై చర్చలు

టిడిపి, జనసేన పొత్తు ఖాయమని పవన్ ప్రకటించడంతో జిల్లాలో అసెంబ్లీ సీట్ల పంపకాలపై ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాతిపదికన లెక్కిస్తే 14 ఎంఎల్ఎ, రెండు ఎంపీ స్థానాలున్నాయి. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, ఏలూరు మొత్తం ఐదు స్థానాలను జనసేన కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా ఉంగుటూరు స్థానానికి సంబంధించి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ఈయన గత కొంతకాలంగా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసిన పరిస్థితి ఉంది. ఇదే నియోజకవర్గంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు ఉన్నారు. ఈ పరిస్థితుల్లో టిడిపి ఉంగుటూరు స్థానాన్ని జనసేనకు కేటాయిస్తుందా అనే అనుమానాలున్నాయి. ఏలూరులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మాజీ ఎంఎల్ఎ బడేటి బుజ్జి సోదరుడు చంటి వ్యవహరిస్తున్నారు. జనసేన నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన రెడ్డి అప్పలనాయుడు ఈ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఇక్కడ కూడా ఏ పార్టీ బరిలోకి దిగుతుందనే దానిపై సందిగ్ధత నెలకొంది. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం సీట్ల విషయంలో పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని లెక్కలు వేస్తున్నారు. సీట్ల పంపకాలకు వచ్చేసరికి జిల్లాలో పొత్తు ఏ విధంగా ఉంటుందో వేచిచూడాలి.

పనులు చేయని కాంట్రాక్టర్లు బ్లాక్ లిస్టులోకే

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ హెచ్చరిక

ప్రజాశక్తి - వీరవాసరం

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రభుత్వం అప్పగించిన పనులు సకాలంలో పూర్తి చేయకపోతే సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టిస్తానని భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ హెచ్చరించారు. రూ.ఆరు కోట్లతో నిర్మించనున్న వీరవాసరం- మత్స్యపురి ఆర్అండ్‌బి రోడ్డు పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సిఎం జగన్ రెండు కళ్లుగా భావిస్తూ పరిపాలన సాగిస్తున్నారన్నారు. వీరవాసరం- పెనుమంత్ర రోడ్డుకు సంబంధించి పనులు మందకొడిగా సాగడంతో కాంట్రాక్టర్ తీరుపై ఎంఎల్ఎ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు తాము దక్కించుకున్న పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల సకాలంలో పనులు పూర్తి కావడం లేదన్నారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేక ప్రభావం పడుతుందన్నారు. నియోజకవర్గంలో భీమవరం, వీరవాసరంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు సిఎం జగన్మోహన్‌రెడ్డి, ఆర్అండ్‌బి శాఖా మంత్రి దాడిశెట్టి రాజా నిధులు మంజూరు చేశారన్నారు. వీరవాసరం-మత్స్యపురి, పంజావేమవరం-అరట్లకట్ల, వీరవాసరం-నవుడూరు, నవుడూరు-మడుగుపోలవరం, వీరవాసరం-వడ్డిగూడెం, భీమవరం-కాళీపట్నం, భీమవరం-లోసరి, భీమవరం-ఎల్ఎన్‌విపురం రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లకు సంబంధించి గతంలో ఉన్న అంచనాలు మారి వ్యయం రూ.36 కోట్లకు పెరిగినా సిఎం ఆమోదం తెలిపారన్నారు. ప్రస్తుతం పనులు చేపట్టే రోడ్లలో బలహీనంగా ఉన్నచోట సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. మత్స్యపురి, బొబ్బనపల్లి ప్రాంతాల్లో 1.7 కిలోమీటర్లు సీసీ రోడ్లు, మిగిలిన ప్రాంతాల్లో బిటి రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, సర్పంచులు కారిపెల్లి శాంతిప్రియ, చికిలే మంగతాయారు, బోణం పరమేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాసరావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, సైదు శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎంపిటిసిలు బొల్లెంపల్లి శ్రీనివాస్‌చౌదరి, గోడి ఆదిలక్ష్మి, పెంటకోట సైదేశ్వరరావు, బోను జ్యోత్స్నదేవి, ఆర్అండ్‌బి డిఇ రమణ, ఎఇ మూర్తి, తహశీల్దార్ సుందరరాజు, ఎంపిడిఒ జ్యోతి, వైసిపి నాయకులు గోడి షణ్ముఖరావు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, కోటిపల్లి వెంకటబాపూజీ, నాగరాజు శ్రీనివాసరాజు, గోపిరాజు, దాసరి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగులకు ప్రత్యేక స్పందన

భీమవరం: జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఫిర్యాదులు, సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రతినెలా మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్‌డే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉద్యోగుల గ్రీవెన్స్‌డే స్థానిక స్పందన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

రూ.26 వేలు వేతనమివ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి - పెనుమంత్ర

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ ఎం.గోపాలకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనంతోపాటు మ్యాన్ డేస్ టార్గెట్ విధానం రద్దు చేయాలని, అందరికీ ఎఫ్‌టిఇ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ సీనియర్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లు అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా కొనసాగించాలన్నారు. అందరికీ ఎఫ్‌టిఇ అమలు చేయాలని కోరారు. మున్సిపాల్టీల్లో విలీనమైన పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నేతలు కె.విజయలక్ష్మి, పి.విలియమ్, కె.సాయికనకదుర్గ, కె.విశాలాక్షి, కె.సీతామహాలక్ష్మి, బి.సత్యప్రియ, వి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో నియామక పరీక్షలకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్, ఇ-డివిజనల్ మేనేజర్, డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్, భీమవరం డివిజన్‌లో ఇ-డివిజనల్ మేనేజర్ మొత్తం రెండు పోస్టులు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, కలెక్టరేట్లో ఎన్నికల విధులు నిర్వహించడానికి ఎనిమిది డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులను పొరుగుసేవల పద్ధతిలో భర్తీకి గత నెలలో నోటిఫికేషన్ జారీ చేశామని పేర్కొన్నారు. ఆయా పోస్టుల భర్తీలో భాగంగా ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్, ఇ-డివిజనల్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 16వ తేదీ శనివారం, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు 17న భీమవరంలోని బివి.రాజు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత అభ్యర్థులు ఆయా తేదీల్లో పరీక్షలకు హాజరు కావాలని, హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ధాన్యం సేకరణకు ప్రణాళిక సిద్ధం

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం సేకరణకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. ప్రస్తుతం ఇ-క్రాప్ నమోదు నేపథ్యంలో పంటల సాగు ఆధారంగా ధాన్యం సేకరణకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సుమారు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో 409 రైతుభరోసా కేంద్రాలు ఉండగా 387 రైతుభరోసా కేంద్రాల పరిధిలో వరి సాగవుతుందని ప్రాథమికంగా గుర్తించామన్నారు. నవంబర్‌లో ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించడానికి అధికారులు సన్నద్ధం కావాలన్నారు. దీనికి అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు తహశీల్దార్ల ఆధీనంలో ఉంచాలని తెలిపారు. జిల్లాకు కోటి గోనె సంచులు అవసరమవుతాయని అధికారులు గుర్తించారని, వాటిని ముందస్తుగా సమకూర్చుకోవాలని అన్నారు. ధాన్యం సేకరణకు నియమించే ప్రత్యేక అధికారుల ఆధీనంలో తేమ యంత్రాలు ఉండాలని ఆదేశించారు. రైతుభరోసా కేంద్రాలు, మిల్లుల వద్ద ధాన్యంలో తేమశాతం తేడాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎన్.సరోజ, డిసిఒ ఎం.రవికుమార్, ఎఎస్ఒ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి - విలేకరులు

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐదు రోజులుగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలు గురువారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఆచంట: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యాన రిలేదీక్షలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేతా మీరయ్య, బలుసు శ్రీరామ్మూర్తి, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, గుబ్బల మాధవరావు, నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, కేతా మురళి పాల్గొన్నారు.

భీమవరం రూరల్: టిడిపి ఆధ్వర్యాన రిలేదీక్షలు స్థానిక పట్టణ కార్యాలయం వద్ద రెండో రోజు గురువారం ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి ప్రారంభించారు. శిబిరాన్ని టిడిపి నాయకుడు పెన్మెత్స వెంకట్, సిపిఐ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అఖిలపక్ష రాజకీయ పార్టీలతో త్వరలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, సికిలే పుష్పకుమారి, నాగిడి శాంతమూర్తి మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వరరావు, టిడిపి నాయకులు మెరగాని నారాయణమ్మ, ఎస్‌డి.నసీమాబేగం, ఎమ్‌డి.షబీనా, బి.పద్మ, గంధం రాధ, వేంద్ర శ్రీనివాస్, మామిడిశెట్టి ప్రసాద్, చెల్లబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: టిడిపికి చెందిన అగ్నికులక్షత్రియ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక వలందర్ రేవు వద్ద గోదావరిలో జల దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కొప్పాడి రవీంద్ర, వైదాని నాగేశ్వరరావు, కొల్లు పెద్దిరాజు, నాగిడి రాంబాబు, బర్రె మురళి, నాత్ర నరేష్, తిరుమాని హేమంత్, మల్లాడి మూర్తి, పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పాలకొల్లులో రెండో రోజు గురువారం దాసరి విగ్రహం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. యలమంచిలి మండలం నేతలు దీక్షల్లో కూర్చున్నారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ వీరికి పూలమాలలు, నల్ల రిబ్బన్లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అనేక సమస్యల్లో ఉంటే జగన్ మంత్రివర్గం, అధికారులు చంద్రబాబుపై కేసులు ఇరికించడంలో నిమగ్నమయ్యారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బోనం వెంకటనరసయ్య, అల్లు రాధాకృష్ణ, శిడగం సూరి, ప్రేమ్‌కుమార్, పితాని వెంకి, పద్మ, రవీంద్ర, దినేష్, జివి, బాబు పాల్గొన్నారు.

ఉండి: చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని టిడిపి జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ దగ్గర ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో దీక్షాధారులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు గుండాబత్తుల నాగేశ్వరరావు, గేదెల జాన్, గండి నందిరాజు, తోట ఫణిబాబు, జోగయ్య, బండారు వేణు గోపాలరావు పాల్గొన్నారు.

నరసాపురంలో జలదీక్ష చేస్తున్న టిడిపి నేతలు, కార్యకర్తలు

మొగల్తూరు: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గుబ్బల నాగరాజు ఆధ్వర్యాన రిలేదీక్షలు చేపట్టారు. ఈ శిబిరాన్ని ఆ పార్టీ మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, నేతలు సిరిగినీడి రాజ్యలక్ష్మి, సంకు భాస్కర్‌నాయుడు, పాలా దుర్గాభవాని, గుత్తుల సాయినాగరాజు, కత్తిమండ ముత్యాలరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, పాలా రాంబాబు, గోపాలం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో కిలపర్తి వెంకట్రావు అధ్యక్షతన టిడిపి నేతలు గురువారం రెండోరోజు నల్ల రిబ్బన్లతో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో దాసరి అప్పన్న, పీతల సత్యనారాయణ, ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: టిడిపి శ్రేణులు గురువారం పట్టణంలోని కప్పల వెంకన్న సెంటర్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. మాజీమంత్రి పీతల సుజాత కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. దీక్షలో ఇరగవరం మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలకు సహకరించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల విజయవంతానికి వైద్యులు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణకు అవసరమైన వైద్యుల కేటాయింపు తదితర విషయాలపై ఐఎంఎ సభ్యులు, రెడ్‌క్రాస్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వైద్య అధికారులతో ఆమె సమీక్షించారు. శిబిరాల నిర్వహణకు ఐఎంఎ నుండి ప్రత్యేఎక వైద్య నిపుణులను కేటాయించాలన్నారు. అలాగే నెట్‌వర్క్ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్పిటల్స్ నుండి స్పెషలిస్ట్ డాక్టర్లను ఏర్పాటు చేస్తారన్నారు. ఈ శిబిరాలు ఈ నెల 30న జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాల్టీల్లో ప్రారంభిస్తారన్నారు. ఇంటింటి సర్వే, శిబిరాలు నిర్వహించే రోజున కొంతమంది నర్సింగ్ స్టాఫ్‌ను కేటాయించాలని నర్సింగ్ కళాశాల యాజమాన్యాలను కోరామని తెలిపారు. అందరి సహకారంతో జగనన్న సురక్ష విజయవంతం చేయాలనే దీక్షతో ముందుకు సాగుతున్నామన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, అడిషనల్ డిఎంహెచ్ఒ బి.భానునాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కీర్తి, ఐఎంఎ అధ్యక్షులు, సెక్రటరీలు, నర్సింగ్ కళాశాలల మేనేజర్లు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్

ఉండి: ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. గురువారం పెదపుల్లేరులో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామానికి రూ.77 లక్షలు మంజూరయ్యాయని, రక్షిత నీటి పథకం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే ప్రజలందరికీ తాగునీరందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాయి రావులమ్మ, వైసిపి గ్రామ అధ్యక్షులు పప్పుల రాంప్రసాద్, నాయకులు కలిదిండి సీతారామరాజు, ఎడ్ల సత్యనారాయణ, కమ్మిలి గణేష్‌వర్మ పాల్గొన్నారు.

వైసిపి హయాంలో రైతులు అధోగతి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి హరేరామ్

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి ప్రభుత్వం రైతులను అధోగతి పాల్జేసిందని, ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయాన్ని, రైతాంగాన్ని ఆదుకునే నిర్ణయాలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. హరేరామ్ మాట్లాడుతూ ప్రభుత్వం గత రబీ సీజన్లో రైతులను నానా ఇబ్బందులు పెట్టి నష్టాల పాల్జేసిందని విమర్శించారు. స్థానికంగా ఉన్న రైసుమిల్లులకు కాకుండా 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న రైసుమిల్లులకు ధాన్యం తోలాలని ఆదేశాలు జారీ చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నూక, తేమశాతం పేరుతో మిల్లర్లు డబ్బులు వసూలు చేయడం దారుణమన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో ఇటువంటి ఆటంకాలు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. రైతులున్న గ్రామంలోనూ, మండల పరిధిలోని రైస్‌మిల్లులకే తోలేటట్లుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇ-క్రాప్ నమోదు పూర్తిస్థాయిలో జరిగేటట్లుగా చూడాలని, కౌలురైతులకూ ఆ అవకాశం కల్పించాలని కోరారు. ఈ నెల 16న కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలని, కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు కేరళ తరహాలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి రైతుల సదస్సు రాజమండ్రిలో జరుగుతుందని, దీనికి కొబ్బరి రైతులందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. అధిక వర్షాలు, ముంపు వల్ల నష్టపోయిన తమలపాకు, కూరగాయల రైతులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, కిలారి తవిటినాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి తూటే మార్టిన్‌లూథర్, చింతపల్లి లక్ష్మికుమారి, తాళ్లూరి హరిహరరామలక్ష్మణ్, బొర్ర అలమహారాజు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలి

కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

దళితుల ఆత్మగౌరవం, ఉపాధి, సంక్షేమం, దళితపేటల అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం చేపట్టిన దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల సంయుక్త సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఉభయ సంఘాల జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు, సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, బలహీన వర్గాల హక్కులను కాలరాస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పేరుతో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసే ప్రయత్నాలను తీవ్రతరం చేస్తున్నారన్నారు. మరోపక్క ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టి సామాన్యులపై మోయలేని భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మోడీ విధానాలను తూచా తప్పకుండా అమలు చేయడంలో జగన్ సిద్ధహస్తుడయ్యాడన్నారు. దీనిలో భాగంగానే నూతన విద్యా విధానం, విద్యుత్ ఛార్జీల పెంపు, అసైన్డ్ చట్ట సవరణ వంటివి అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ ఈ నెల 15 నుండి 20 వరకు సంతకాల సేకరణ, 21 నుండి 24వ తేదీ వరకు 20 మండలాల్లో ప్రచార జాతా నిర్వహించాలని, ఈ నెల 29న విజయవాడలో జరిగే మహా ధర్నాకు జిల్లా నుండి పెద్దసంఖ్యలో ప్రజలను సమీకరించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఉభయసంఘాల నాయకులు కప్పల రత్నంరాజు, కె.సోమరాజు, బల్ల చినవీరభద్రరావు, షేక్ పాదుషా, బి.సూర్యచంద్రరావు, సొదడాసి సంజీవరావు, యడ్ల మోహన్‌రావు, జి.శ్యాంబాబు, బాతు రామస్వామి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు : పివిఎల్

ప్రజాశక్తి – ఉండి

అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం పెదపుల్లేరులో నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పివిఎల్ నరసింహరాజు మాట్లాడారు. గతంలో కొత్త పింఛన్ల నమోదు కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తిరగాల్సి వచ్చేందని, జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి పారదర్శకంగా పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వాలంటీర్ల ద్వారా పింఛన్లు నమోదు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా వైసిపి ఒంటరిగానే పోటీ చేసి అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాయి రావులమ్మ, గ్రామ అధ్యక్షులు పప్పుల రాంప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్, పెంటపాడు మండలాల పరిధిలో కొత్తగా 1702 మందికి కొత్త పెన్షన్లు స్థానిక క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తాడేపల్లిగూడెం ఎంపిడిఒ విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ కార్యక్రమం నిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ జగన్‌తోనే జనానికి మేలు జరుగుతోందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో భాగంగా 1702 మంది అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే గూడెం నియోజకవర్గంలో 32,550 మందికి పెన్షన్లు ఇస్తున్నామని, వీటికి అదనంగా 1702 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్‌కుమార్, వన్ టౌన్ సచివాలయ కన్వీనర్ కోలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

పాలకోడేరు పెన్షన్లు అందజేస్తున్న జగన్మోహన్‌రావు, ప్రకాష్

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరులో కొత్తగా మంజూరైన పింఛన్లను వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, సర్పంచి చొప్పల రజిని, ఉపసర్పంచి చంటి రాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : వైసిపి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతిస్తోందని వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. పట్టణంలో 1, 2, 3, 7, 20, 21 వార్డుకు సంబంధించి నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో పింఛను మంజూరు కావాలంటే ఎదురు చూడాల్సి వచ్చేదని, జగనన్న పాలనలో ప్రతి ఆరు నెలలకోసారి అర్హులకు పింఛన్లు మంజూరవుతున్నాయని మోగల్లు సోషల్ మీడియా గ్రామ సచివాలయాల ఇన్‌ఛార్జులు మద్దుల జగన్మోహన్ రావు (మౌళి) కోనాల ప్రకాష్ అన్నారు. మోగల్లులో గురువారం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరలా జగనన్నను అంతా ముఖ్యమంత్రిగా చూడాలన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా మండల ఇన్‌ఛార్జి, సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి, కాటూరి శాంతకుమారి, పెన్మత్స వెంకటలక్ష్మి, దొడ్డా విసు, బలే చిట్టిబాబు, బాలయ్య, చక్రధర్ రావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్లు వినోలా ప్రసన్న పాల్గొన్నారు. అలాగే శృంగవృక్షం గ్రామ సర్పంచి జంగం సూరిబాబు ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన 65 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు కలిదిండి కృష్ణంరాజు (బుజ్జి,) సర్పంచి జంగం సూరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సొడదాసి నరేష్, పంచాయతీ ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు, వార్డు సభ్యులు సోము దుర్గాభవాని, వడ్డీ శేషు కుమార్, సొసైటీ అధ్యక్షుడు పాలా లక్ష్మణరావు, చెలంకూరు సత్యనారాయణ, చింతపల్లి ఆదిలక్ష్మి దండు పాల్గొన్నారు.

పోడూరు : అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేయడమే సిఎం జగన్ లక్ష్యమని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి అన్నారు. గురువారం రావిపాడు, వద్దిపర్రు, పెనుమదం గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్తగా మంజూరైన పెన్షన్లను ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళిసాగర్, డిటిడిసి బాబు, సర్పంచి తానేటి బాబూరావు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి – పెనుమంట్ర

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని మార్టేరు సర్పంచి మట్టా కుమారి అన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల పౌష్టికాహారాలతో చేసిన వంటకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టా కుమారి మాట్లాడుతూ బాలామృతంతో చేసిన స్వీట్లు, లడ్డూలు, చిరుధాన్యాలతో చేసిన లడ్డూలు గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అన్నారు. అదే విధంగా మునగాకుతో చేసిన పకోడీ, అటుకులతో పులిహోర, బాలామృతంతో చేసిన బిస్కెట్లు, కేకు, రాగి చపాతి, జొన్న లడ్డూలు నిత్యం తినడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, మార్టేరు పిహెచ్‌సి కె.కార్తీక్, సూపర్‌వైజర్ ఆర్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి కోరారు. గురువారం సాయంత్రం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ అవసరమైన ప్రాథమిక వైద్యం పూర్తిస్థాయిలో అందుతుందన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ నెల 30వ వరకు నెల 5, 12, 17 తేదీల్లో కార్యకర్తలు ఇంటింటికి వెళతారని తెలిపారు. అంగన్వాడీలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు మొత్తం పట్టణంలో 50 మంది పైగా ఉంటారని, వారందరూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం కేటాయించిన యాప్‌లో పూర్తి ఆరోగ్య పరిస్థితులు నమోదు చేస్తారని చెప్పారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు లాబ్‌లో ఉచితంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పుప్పాల సత్యనారాయణ (పండు), కోఆప్షన్ సభ్యులు మొహమ్మద్ జిక్రి అహ్మద్ పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుపై హర్షం

తాడేపల్లిగూడెం: జీవిత బీమా కుటుంబ పెన్షన్ పెంపు డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 11న గెజిట్ ప్రకటన ద్వారా అనుమతిస్తూ పరిష్కరించినందుకు అఖిలభారత బీమా పెన్షనర్ల సంఘం రాజమండ్రి డివిజన్ సంయుక్త కార్యదర్శి గరికపాటి బాపయ్య శర్మ హర్షం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఉన్న ఎల్ఐసి ఫ్యామిలీ పెన్షనర్ల బేసిక్ పెన్షన్ 15 నుండి 30 శాతానికి పెంచడం వల్ల సంస్థలో సీనియర్ పెన్షనర్ల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థల కుటుంబ పెన్షన్ పెంపుదలకు కేంద్ర ప్రభుత్వం అనుమతివ్వాలని బాపయ్య శర్మ డిమాండ్ చేశారు.

ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి – వీరవాసరం

తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మను గుర్తింపు పొందిన వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని వీరవాసరం రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంఘం జిల్లా కార్యదర్శి యండమూరి సుబ్బారావు మాట్లాడుతూ ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని రజక వృత్తిదారుల హక్కుల కోసం, సామాజిక అభివృద్ధి కోసం పాటుపడదామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గ్రామాధ్యక్షుడు పాలకోడేటి లక్ష్మణరావు, కార్యదర్శి కేశవరపు శేషు, కేశవరపు శ్రీను, బొమ్మనపల్లి సూర్యచంద్రరావు, యండమూరి దుర్గారావు పాల్గొన్నారు.

సర్ణాంధ్రలో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి – నరసాపురం టౌన్

సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు 'నైతికత – మానవ విలువలు' అంశంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన స్పందన ఇడివ ఇంటర్నేషల్ ఫౌండేషన్ ఛైర్మన్ శామ్యూల్ రెడ్డి మాట్లాడారు. యువతలో నిరాశ నిస్పృహలు, తీవ్రమైన మానసిక ఒత్తిడిని నివారించడం, ఆలోచన విధానాలను సరళమైన పద్ధతిలో ఉండడంపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథస్వామి, డైరెక్టర్ శ్రీహరి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

మాంటిస్సోరీలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ప్రజాశక్తి – పాలకొల్లు రూరల్

పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు గురువారం నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి స్పెషల్ కేటగిరి, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ రావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్ పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

ప్రజాశక్తి – పెనుమంట్ర

నెగ్గిపూడి పరిధిలోని అరుంధతీపేటలో భారతిలక్ష్మికి చెందిన తాటాకిల్లు ఇటీవల పూర్తిగా కాలిపోయింది. ఆ కుటుంబానికి అల్లం చిన్నబ్బాయి సత్యవతి జ్ఞాపకార్థం వారి కుమారులు అల్లం బుల్లిరెడ్డి, అల్లం భాస్కర్‌రెడ్డి 25 కేజీల బియ్యం, రూ.4 వేలు నగదు అందజేశారు.

కోపల్లెలో క్రీడాకారుల ఎంపిక పోటీలు

ప్రజాశక్తి – కాళ్ల

కాళ్ల మండల స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ కోపల్లె హైస్కూల్లో గురువారం నిర్వహించారు. కాళ్ల ఎంఇఒ–2 గాదిరాజు కనక రాజు ఎంపికను ప్రారంభించారు. ఈ పోటీలను మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.విజయ ఆధ్వర్యంలో నిర్వహించారు. కబడ్డీ, త్రో బాల్, వాలీబాల్, టెన్నికాయిన్ క్రీడాంశాల్లో మండలస్థాయి ఎంపికలు నిర్వహించారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బారాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కె.బంగార్రాజు, వి.రామరాజు పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి– తణుకు

తణుకు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం సూర్యారావు పాలెంకు చెందిన ముగ్గురు మోటార్ సైకిల్‌పై తణుకు వస్తుండగా శర్మిష్ట జంక్షన్ వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి వెనుక నుంచి ఢీ కొట్టింది. అదే సమయంలో మరో మోటార్ సైకిల్ కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యారావు పాలెం చెందిన చదలవాడ ప్రేమ్‌కుమార్ (21) సంఘటనా స్థలంలోనే మృతి చెందగా మర్లపూడి రాజు తీవ్రంగా గాయపడ్డాడు. మరో వ్యక్తి సావరం గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ రెడ్డి కూడా గాయపడ్డాడు. గాయపడ్డ ఇద్దరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ రాజు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో వేరే ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వ్యక్తులు పెయింటింగ్ పనుల నిమిత్తం తణుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆకుల బుల్లబ్బాయి ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఎనిమిది మంది అరెస్టు

ప్రజాశక్తి – ఉండి

పాందువ్వ గ్రామ శివారున కోడిపందేల స్థావరాలపై గురువారం ఉండి, గణపవరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 42 మోటార్ సైకిళ్లు, 8 కోడిపుంజులు, రూ.51,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఉఎస్ఐ కె.గంగాధర్‌రావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

త్వరలో డంపింగ్ యార్డు ఏర్పాటు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి – భీమవరం రూరల్

తాడేరు మెయిన్ రోడ్డుకు, గ్రామానికి చాలా సుదూరంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తున్నామని, ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనులు పూర్తి చేస్తామని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాడేరుకు సుదూరంగా ఏర్పాటు చేస్తున్న కంపోస్ట్ యార్డుకు సేకరించిన 6 ఎకరాల 60 సెంట్ల భూమిని గురువారం ఎంఎల్ఎ పరిశీలించి మాట్లాడారు. ప్రముఖ సంస్థ స్వచ్ఛంద కార్పొరేషన్ సంస్థతో నాలుగెకరాల అభివృద్ధిపై ఒప్పందం కుదిరిందన్నారు. మిగిలిన రెండెకరాల 60 సెంట్లు యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేస్తామని తెలిపారు. సుమారు 60 లక్షలతో కంపోస్ట్ యార్డుకు వెళ్లే రహదారిని వేస్తామన్నారు. అభివృద్ధి పనులు చేస్తున్న తనపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యామల, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో కంప్యూటర్ విజన్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి – భీమవరం రూరల్

ఎన్ని బృహత్తర పరిశోధనలు చేసిన వాటి విశ్లేషణ కంప్యూటర్ విజన్ సహాయంతోనే జరుగుతుందని పలువురు నిపుణులు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టి ఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ డిపార్ట్మెంట్ల సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ విజన్‌పై రెండు రోజులపాటు వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ఎఐఎంఎల్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ జిఎన్‌వి జి.శిరీష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాఫ్ట్ వేర్ నిపుణులు, 360 డిజిట్ ఎంజి సిఇఒ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.భరణి కుమార్ మాట్లాడుతూ రోబోలను కూడా పని చేయించేది కంప్యూటర్ సహాయంతో అని తెలిపారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన చంద్రయాన్–3లో గ్రోవర్ నడకను కంప్యూటర్ సహాయంతోనే గమనిస్తున్నారని, కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పుడు దాని గమనాన్ని కూడా మార్చుతున్నారని పేర్కొన్నారు. సిఎస్‌సి హెడ్ వి.చంద్రశేఖర్, ఎఐఎంఎల్ హెడ్ జిఎన్‌వి జి.శిరీష మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, సిఎస్‌సి అసిస్టెంట్ ప్రొఫెసర్ శివశంకర్ పాల్గొన్నారు.

'టిడిపితో జనసేన పొత్తు హాస్యాస్పదం'

ప్రజాశక్తి – ఆచంట

రానున్న ఎన్నికల్లో వైసిపి విజయాన్ని అడ్డుకునేందుకే టిడిపితో పొత్తు అంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య స్పందించారు. గురువారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ స్కాం లో ఏ–1 నిందితుడిగా ఉన్న చంద్రబాబును పవన్ కళ్యాణ్ సెంట్రల్ జైల్లో కలిసి, అనంతరం టిడిపితో పొత్తు హాస్యాస్పదంగా ఉందన్నారు. మొదటి నుంచి పవన్ కళ్యాణ్ టిడిపితోనే ఉన్నారనే విషయం అందరికీ తెలుసన్నారు. ఇక ఇది పొత్తులకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధమని, మిమ్మల్ని మూకుమ్మడిగా ఈ రాష్ట్రం నుంచి తరిమికొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి – భీమవరం రూరల్

అగ్రిగోల్డ్ బాధితులందరికీ డిపాజిట్లు చెల్లించి వారిని ఆదుకోవాలని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు విమర్శించారు. అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ ఇచ్చిన చలో విజయవాడ నేపథ్యంలో భీమవరంలో అసోసియేషన్ నాయకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో అసోసియేషన్ నాయకులను భీమారావు కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులను అరెస్టులు చేయడం దారుణమని, వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్లుగా అగ్రి బాధితులు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని, పాలకులు పట్టించుకోకుండా గాలికొదిలేయడం దారుణమని విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఓట్లేయించుకున్న జగన్ మడమ తిప్పాడని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, నాయకులు నాగిడి శాంతమూర్తి, మల్లుల శ్రీనివాసరావు, ఎపి.మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.

సరిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి – గణపవరం

స్థానిక పిహెచ్‌సి పరిధిలోని సరిపల్లిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పి.సంతోష్‌నాయుడు 192 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం గణపవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 350 మంది బాలబాలికలకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 31 మందికి కళ్లజోళ్లు పడతాయని డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఎంఎల్‌హెచ్ పి.మౌనిక, ఎఎన్ఎం ఎన్.నాగవేణి పాల్గొన్నారు.

గూడెంలో ఎడిజె కోర్టు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి తాడేపల్లిగూడెంలో ఎడిజె కోర్టు మంజూరు, ఇఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే మంత్రి కొట్టు సత్యనారాయణ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణకు న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, జనరల్ సెక్రటరీ దాసం సునీల్ కుమార్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి – ఉండి

వాహన ప్రయాణంలో హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యం వహించడం వల్ల తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్ఐ గంగాధర్ రావు తెలిపారు. గురువారం ఉండి మెయిన్ సెంటర్లో హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి క్షేమంగా వెళ్లేలా ఇంట్లోని వారికి భరోసా ఇవ్వాలన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ మితిమీరిన వేగంతో వెళ్తున్నారని దీంతో రోడ్డు ప్రమాదానికి గురైతే హెల్మెట్ ధరించడం వల్ల గాయాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా సెల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

మతోన్మాద కార్పొరేట్ విధానాలు వినాశకరం

ప్రజాశక్తి – ఆచంట

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలు దేశానికి వినాశకరంగా మారాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. ఆచంట వేమవరంలో కర్ణోద్భవ కళ్యాణ మండపం వద్ద సిపిఎం ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాలకు సంబంధించి రెండు రోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులకు సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్.శర్మ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. శిక్షణా తరగతుల ప్రారంభ సూచికగా సిపిఎం వేమవరం గ్రామ సీనియర్ సభ్యులు కొండేటి సత్యన్నారాయణ సిపిఎం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా 'హిందూత్వ మతోన్మాదం, ప్రమాదం' పాఠ్యాంశాన్ని ప్రతాప్ కార్యకర్తలకు బోధించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తోందన్నారు. మధ్యాహ్నం 'నయా ఉదారవాద ఆర్థిక విధానాలు – ప్రజలపై ప్రభావం అంశాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు కార్యకర్తలకు బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబు, గుత్తుల రంగారావు, పి.మోహనరావు, కుసుమే జయరాజు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తొలి ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి – ఆకివీడు

నగర పంచాయతీగా ఏర్పడిన ఆకివీడులో నూతనంగా అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించారు. ఈ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు గాను ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా వైసిపి నగర పంచాయతీ పాలకవర్గ కౌన్సిలర్ పడాల శ్రీనివాసరెడ్డిని నియమించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి అధ్యక్షుడిగా ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మరో ఐదుగురు ప్రభుత్వాధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

ఉత్తమ గురువులకు సత్కారం

ప్రజాశక్తి – కాళ్ల

పాఠశాల విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంలో మురళీ, రవికుమార్ రాజు కృషి అభినందనీయమని ఎంఇఒలు అక్కాబత్తుల రవీంద్ర, గాదిరాజు కనకరాజు అన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్న ఇద్దరు గురువులను వేంపాడు గ్రామస్తులు, పలు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సత్కరించారు. వేంపాడు (హిందీ) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెల్లంకొండ నాగ మురళి శ్రీనివాసరావు (మురళీ), వేంపాడు (ఎల్ఇ) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేటుకూరి రవి కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉందని, తమ పట్ల మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఇర్రింకి పద్మావతి, డాక్టర్ వేగేశ్న రామకృష్ణంరాజు, రిటైర్డ్ ఎడిఎ వేగేశ్న పుల్లంరాజు, గ్రామస్తులు కోసూరి సత్యనారాయణరాజు, వేగేశ్న సీతారామరాజు, ఉపాధ్యాయులు బి.కిషోర్, పివి.వరలక్ష్మి, జ్యోతి, మమత, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, యుటిఎఫ్ నేత బిఆర్ఎంకె.స్వామి, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి సాయివర్మ, విరమల్లు జనార్దన్, సిఆర్‌పి ఎస్.వెంకన్నబాబు, పిఆర్‌టియు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ టివివి.కృష్ణమూర్తి, వేంపాడు వాసవి క్లబ్ అధ్యక్షులు కె.మురళీకృష్ణ, కార్యదర్శి ఎం.నాగరాజు, కోశాధికారి బి.రత్నకుమార్ గుప్త, సభ్యులు బి.బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి – పాలకొల్లు రూరల్

లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిబిజె.ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, కవితలు, పద్యాలు, చిత్రలేఖనం, వ్యాకరణాంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల హిందీ ఉపాధ్యాయులు గొల్ల జనార్దన్‌రావు, డి.మహేష్, కె.భాగ్యశ్రీ బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎంను ఘనంగా సత్కరించారు.

గణపవరం : కొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటకం సుందరకుమార్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.సౌజన్య, ఎల్.ప్రసాదరావు, జి.పార్వతి పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో హిందీ దివస్ సందర్భంగా గురువారం పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్ర ధారణతో జాతీయతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బి.సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం వ్యాసరచన, హిందీ కవితల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పాలకొల్లు : పాలకొల్లు మాంటిస్సోరి స్కూల్లో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం హిందీ భాషాభివృద్ధికి తోడ్పడిన కవులు, రచయితలు, సాహిత్యకారులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా అమలాపురానికి చెందిన హిందీ అధ్యాపకుడు సత్యనారాయణ మాట్లాడారు. హిందీ ప్రపంచంలోనే అత్యంత మధురమైన భాష అని తెలిపారు. తేలికగా నేర్చుకునే భాష అని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కెవి కృష్ణవర్మ, ప్రిన్సిపల్ ఎస్‌పిఎస్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు. అలాగే ఎవిఎస్ మున్సిపల్ హైస్కూల్లో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.విష్ణుమూర్తి హిందీ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వ్యాసరచన, డిబెట్, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే హిందీ పండిట్స్ సిహెచ్.సరస్వతి, బిఎం.రాజేశ్వరీని సత్కరించారు. ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హిందీ అధ్యాపకులు ఎస్ఎస్ రమణ కుమార్ నిర్వహించారు.

మాధవాయిపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

నరసాపురం టౌన్: పట్టణంలోని 4వ వార్డు మాధవాయిపాలెం, పొన్నపల్లిలో గురువారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ ప్రతి సమస్యనూ పరిష్కరించి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు అనంతరం అధికారులతో సమీక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజారోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బర్రె వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో కార్గో ఏజెన్సీ ఏర్పాటు

గణపవరం: గణపవరం బస్టాండ్‌లో కార్గో ఏజెన్సీని ఏర్పాటు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ ఎస్ఎన్.మూర్తి గురువారం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్గో ఏజెన్సీ ఏర్పాటు చేయడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లే వారికి టికెట్టు సౌకర్యం కలుగుతుందన్నారు. అదేవిధంగా తక్కువ ధరకు కార్గో ఏజెన్సీ ద్వారా పార్సిల్ డోర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. బస్టాండ్‌లో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతినెలా తాడేపల్లిగూడెం బస్టాండ్ నుంచి అరుణాచలం యాత్రా స్పెషల్ బస్సు వెళుతుందని చెప్పారు. ఈ నెల 27, అక్టోబర్ 26, నవంబర్ 25, డిసెంబర్ 24వ తేదీల్లో రాత్రి 7 గంటలకు బస్సు బయలుదేరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఎటిఎం కమర్షియల్ ఇన్‌ఛార్జి జిఎన్‌వి.సుబ్బారావు, బస్టాండ్ కంట్రోల్ పాండురంగారావు పాల్గొన్నారు.

'ఎసిబి జడ్జిపై అభ్యంతరకర పోస్టులు సరికాదు'

పాలకొల్లు : గౌరవనీయులైన ఎసిబి జడ్జిని కొంత మంది సోషల్ మీడియాలో అవమానపరుస్తూ పెడుతున్న పోస్టులను ఖండిస్తూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరినట్లు జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు చెప్పారు. గురువారం ఆయన పాలకొల్లులో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 10న చంద్రబాబు కేసు విచారణలో 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ ఎసిబి జడ్జి తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతున్న వ్యక్తులు, ఈ విధంగా బిసి సామాజిక వర్గానికి చెందిన జడ్జిని అవమానపర్చడం సరికాదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారిని కులాల పేరు ఆపాదిస్తూ, వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. జడ్జి స్థానంలో ఉన్నవారు, విధి నిర్వహణలో న్యాయమూర్తిగా, న్యాయ సూత్రాలను అనుసరిస్తూ తీర్పులిస్తారు గాని, కులమతాలకు అనుగుణంగా తీర్పులు ఇవ్వరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు కాండ్రేకుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు గోనబోయిన దుర్గారావు, ఎస్‌కె బాజీ, ముంగండ సురేష్, యలమంచిలి మండల అధ్యక్షుడు అనిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

నోటీసు

ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల నివాసం శ్రీ **కోరుప్రోలు వీరయ్య గారి కుమారుడు, శ్రీ సత్యనారాయణ** సంజాయిషీ మేర జారీ చేసిన ప్రకటన.., ది.03-01-2006వ తేదీన శ్రీ కోరుప్రోలు సత్యనారాయణ గారు శ్రీ సిరిపురపు కందాళ వెంకట బలరామాచార్యులు మరియు వారి కుటుంబ సభ్యుల నుండి ఆర్.ఎస్.నెం. 108/3, డో.నెం. 7-106 నందు గల భవనము కొనగోలు చేసినారు. దీని డాక్యుమెంటు నెం. 66/2006. ఈ ఆస్తి తాలూకా లింకు డాక్యుమెంటు నెం. 3921/2002, ది.16-09-2002 నందు శ్రీ సిరిపురపు కందాళ బలరామాచార్యులు గారు వారి భార్య అయిన శ్రీమతి వాణికి దాఖలు చేసియున్నారు. ఈ డాక్యుమెంటు ది.03-01-2006 కొనుగోలు సమయమునందు శ్రీ సత్యనారాయణ గార్కి ఇచ్చియున్నారు. వీరు ఏలూరు వచ్చు ప్రయాణములో పోగొట్టుకొనియున్నారు. ఎన్ని ప్రయత్నములు చేసిననూ డాక్యుమెంటు నెం. 3921/2002 దొరికియుండలేదు. ప్రస్తుతం ఈ ఆస్తి పై శ్రీ సత్యనారాయణ గారు అప్పుకొరకు M/s. Piramil Capital And Housing Finance Ltd., వారిని సంప్రదించినారు. ఇందుమూలముగా ఎవ్వరికీ ఏవిధమయిన అభ్యంతరములు ఉన్ననూ వారం రోజులు లోగా తెలియపరచవలెను.

షెడ్యూలు: ఏలూరు జిల్లా, ద్వారకా తిరుమల (మం), కొమ్ముగూడెం గ్రామం, ఆర్.ఎస్.నెం. 108/3, డో.నెం. 7-106, భవనమునకు హద్దులు: **తూర్పు:** ఆర్ అండ్ బి రోడ్డు. **దక్షిణం:** సాతులూరి శేషమ్మ గారి స్థలం. **పడమర:** రహదారి. **ఉత్తరం:** రహదారి.

పి.ఎస్.చంద్
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
13-9-23. సెల్: 94401 11566

ప్రకటన

మహారాజశ్రీ 2వ అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు :: భీమవరం

D.V.C.No. 11/2021

బిట్వీన్:
పోట్రు శాంతి కుమారి ...కంప్లైనంట్
అండ్
పోట్రు ప్రవీణ్ కుమార్ ...రెస్పాండెంట్

పై నెంబరు D.V.C.లోని, రెస్పాండెంటు అయిన పోట్రు ప్రవీణ్ కుమార్, తండ్రి: పోట్రు కోటేశ్వరరావు, క్రిస్టియన్, వయస్సు 36 సం॥లు, R/o. చెబ్రోలు విలేజ్, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా అను వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు అనే కారణముగా ఈ కోర్టు వారు ది.04-09-2023 సం॥రం తేదీన ప్రజాశక్తి ఏలూరు ఎడిషన్ పేపరులో పబ్లికేషన్ ద్వారా రెస్పాండెంటుకి D.V.C. నోటీసులు అమలు చేయమని ఆదేశించడము అయినది. కనుక ఈ D.V.C. లో రెస్పాండెంటు అయిన పోట్రు ప్రవీణ్ కుమార్, తండ్రి: పోట్రు కోటేశ్వరరావు **ది.18-10-2023 సం॥రం తేదీన స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10:30 ని॥లకు కోర్టుకు హాజరు అయి సదరు కేసులో ఆక్షేపణలు ఉన్న భీమవరం 2వ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకి వచ్చి విన్నవించుకోవాలని ఇందుమూలముగా తెలియజేయటము జరిగింది.**

సి.జ్వాలా శ్రీనివాస్
కంప్లైనంట్ తరపు న్యాయవాది,
భీమవరం, భీమవరం.
14-9-23. సెల్: 93939 39374